క్లుప్తంగా

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్

కర్నూలు(లీగల్): శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు ఉద్దేశం, అందించే సేవలపై వివిధ శాఖల అధికారులకు బుధవారం అవగాహన కల్పించారు. న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదానికి (ఏ ఇతర కోర్టులో పెండింగ్ లేని) సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించి ఇరువురికి న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన వ్యవస్థ పర్మనెంట్ లోక్ అదాలత్ అని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గూడుపల్లి శాంతమ్మకు సత్కారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్)లో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయబోతున్న గూడుపల్లి శాంతమ్మను ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసయ్య, సిబ్బంది మాట్లాడారు. అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని కొనియాడారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కర్నూలు కల్చరల్: బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక ఖండేరిలోని స్వామి వివేకానంద బాల విద్యా మందిర్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు సేవా సప్తాహం పేరుతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు ఎస్. మహేశ్వర్, గురుమూర్తి, ఆర్ఎస్ఎస్ నాయకులు సుబ్బలక్ష్మయ్య, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, నగర అధ్యక్షులు మద్దిలేటి పాల్గొన్నారు.

అగ్నిపథ్‌ను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సైనికుల నియామకాల కోసం అమలు చేస్తున్న అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అగ్నిపథ్ రద్దు కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో రైల్వేల తరువాత అత్యధికంగా ఉద్యోగాలు కలిపించే రక్షణ వ్యవస్థను కూడా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడం అన్యాయమన్నారు. వచ్చేపార్లమెంట్ సమావేశాల్లో అగ్నిపథ్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బీసన్న, నాయకులు చంద్రశేఖర్, అంజి, సోమన్న, షాఫీర్‌బాష పాల్గొన్నారు.

జూలై 8 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

కర్నూలు(సెంట్రల్): కాకినాడలో జూలై 8,9,10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఎస్.షాబీర్ బాషా తెలిపారు. బుధవారం సీఆర్ భవన్ ఆవరణలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో అన్యాయాన్ని ఎదురించే క్రమంలో తీసుకోవాల్సిన మెళకువలపై శిక్షణ తరగతుల్లో వివరిస్తారన్నారు.నేటి సమాజంలోని సామాజిక, రాజకీయ అంశాలపై ఎక్కువగా ఫోకస్‌గా తరగతులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా సదుపాయం కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): హైర్ బస్సు ప్రయాణికలకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో హైర్ బస్సు వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రవేశ పెడితే హైర్ బస్సు డ్రైవర్లకు వేతనాలు పెంచాలన్నారు. ఆర్టీసీ రాబడిలో డ్రైవర్లకు 2 శాతం ఇన్‌సెంటివ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. శ్రీనివాసులు, సుబ్బయ్యా గౌడ్, శేఖర్, చెన్నకేశవులు, సాయిబాబా పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి రమణ పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ పీవీ రమణ

కర్నూలు(హాస్పిటల్): జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ రమణ చెప్పారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వినియోగ, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక శ్రీహరి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో మత్తు పదార్థాల, మాదక ద్రవ్యాల వినియోగం–వాటి అనర్థాలు, మహిళలు, బాలికల అక్రమ రవాణ, ఈవ్ టీజింగ్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీన అంతర్జాతీయ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు మాదక ద్రవ్యాల దుర్వినియోగం యొక్క హానికరమైన ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయినా యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాలకు అలవాటై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాలను వివరించారు. అలాగే ఎవరికి వారే వ్యక్తిగతంగా నేను ఆరోగ్యంగా ఉండాలని దృఢంగా సంకల్పం తీసుకోవాలని, ఆరోగ్యం చెడిపోతే తిరిగి బాగుపడదని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, కొంచెం మెడిటేషన్ చేస్తూ ఉంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండగలమని తెలిపారు. మంచి ఆరోగ్యపు అలవాట్లు చిన్నప్పటి నుంచి ఆచరణలో పెడితే అదే పెద్ద ఆస్తి అని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ధరలను నిత్యం పర్యవేక్షించాలి



సీ.క్యాంపు రైతుబజారులో తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి, టమాట, ఇతర కూరగాయల ధరలను ప్రతి రోజు పర్యవేక్షించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం సాయంత్రం నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. రైతుబజారులో, బయట టమాట, ఉల్లి, కూరగాయల ధరలను పరిశీలించారు. ధరల పెరుగుదలపై వినియోగదారులతో కూడా ముఖాముఖి మాట్లాడారు. బోర్డులో నమోదు చేసిన ధరల ప్రకారమే కూరగాయలు విక్రయిస్తున్నారా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతుబజారు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవిలో కూరగాయలు, టమాట సాగును ప్రోత్సహిస్తే మే, జూన్ నెలల్లో కూరగాయల కొరత ఏర్పడదని పేర్కొన్నారు. బోర్డులో నమోదు చేసిన ధరలను ప్రతి ఒక్కరూ పాటించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి, రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై అలసత్వం వద్దు



చిన్నమార్కెట్ వద్ద చెత్తసేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. బుధవారం స్థానిక నగరపాలక పరిధిలోని చిన్నమార్కెట్, చిన్న అమ్మవారి శాల, కాళీకమ్మగుడి తదితర కాలనీల్లో కమిషనర్ పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే బుధవారపేటలో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో జాప్యం జరగకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. చెత్తకుప్పలు ఎక్కడైనా కనబడితే వెంటనే తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జిలానీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

కర్నూలు (టౌన్) : నగర ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. బుధవారం స్థానిక పూలబజార్, స్వామిరెడ్డినగర్, లక్ష్మీనగర్, శరీన్‌నగర్, గీతముఖర్జీ నగర్‌లలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి నాణ్యతను పరిశీలించారు. ఇళ్లకు వస్తున్న నీటి రంగు, వాసనను, అవశేష క్లోరిన్‌ను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరాలో కలుషితం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్, డీఈఈలు రవిప్రకాష్‌నాయుడు, నరేష్, ఏఈలు జనార్దన్, భాను తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాలను వివాదంలోకి లాగొద్దు



అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాలనీవాసులు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు గ్రామసర్వే నంబర్ 524లో 10.64 ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినది కాదని, అయితే కొందరు అధికారి, అనాధికార వ్యక్తులు అనవసరంగా లేనిపోని సమస్యలు సృష్టించి వివాదంలోకి లాగుతున్నారని 524 కాలనీపరిరక్షణ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కాలనీలో ఆ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా మైనార్టీ అధికారి కాలనీలో పర్యటించి తాము నివాసం ఉంటున్న కొన్ని ఇళ్ల స్థలాలు వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వస్తాయని చెప్పడం భావ్యం కాదన్నారు. 40 ఏళ్ల క్రితం వేసిన వెంచర్‌లో 300 ప్లాట్లను కొనుగోలు చేశామని, అందులో కొందరు ఇళ్లు కూడా కట్టుకున్నారన్నారు. అయితే కొందరు అనధికార వ్యక్తులు తాము కొనుగోలు చేసిన ప్రాంతం వక్ఫ్ బోర్డు పరిధి కిందకు వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఏపీ హైకోర్టుకు కూడా వెళ్లినట్లు చెప్పారు. తమ కాలనీకి సమీపంలో వక్ఫ్‌బోర్డు భూమిలో మునిసిపల్ అధికారులకు తెలియకుండా పెద్ద భవనాన్ని నిర్మిస్తున్నారని, అధికారులు దానిని అడ్డుకోవాలని కమిటీ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు,హరిప్రసాదు, రాముడు, బాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పథకాలు పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద ఎస్సీలకు సబ్సిడీని పెంచాలన్నారు. రూ.10 లక్షల నుంచి 50 లక్షల వరకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బజారన్న, మైనార్టీ సెల్ సిటీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, డీసీసీ కార్యదర్శులు ఎజాజ్ అహ్మద్, జాన్‌సదానందం పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: దక్షిణ ఆంధ్ర సంభాగ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఏకల్ అభియాన్ ఏకల్ గ్రామ సంఘటన్ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక దేశభక్తి సహిత కళా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సునీల్‌కుమార్, రమణమూర్తి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులతో దేశభక్తినిన పెంపొందింప చేసే సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

30న భూతకాలం సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెల చివరి ఆదివారం ప్రదర్శించే సాంఘిక నాటకాల్లో భాగంగా ఈనెల 30వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు 'భూతకాలం' సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కన్వీనర్లు యాగంటీశ్వరప్ప, గాండ్ల లక్ష్మన్న తెలిపారు. ప్రముఖ సినీ రచయిత ఎం.దివాకర్ బాబు రచించిన ఈ నాటకానికి సినీ, టీవీ నటులు వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కర్నూలు (లీగల్): నిత్యం కేసుల ఆలోచనలతో సతమతమయ్యే న్యాయవాదులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఓమిని ఆసుపత్రి డాక్టర్ ఇందు ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ శిరీష్ అన్నారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ తదితరులతో పాటు దాదాపు 250 మంది లాయర్లకు బీపీ, షుగర్ టెస్టులు చేశారు.

రిజర్వేషన్ల పితామహులు సాహు మహరాజ్



బీసీ భవన్‌లో సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): స్త్రీల పక్షపాతి, రిజర్వేషన్ల పితామహులుగా సాహు మహరాజ్ చరిత్రలో నిలిచిపోయారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. బుధవారం సాహు మహరాజ్ 150వ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి మహిళలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ దళిత బహుజనులకు ప్రజాస్వామిక తాత్విక పునాది మీద సామాజిక న్యాయం ఏర్పరచి ప్రజల రాజుగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌లో ...

నగరంలోని బీ క్యాంప్ బీసీ భవన్‌లో సాహు మహరాజ్ 150వ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సాహుమహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి సారిగా రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, 1918లోనే పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన అభ్యుదయ వాది సాహు మహరాజ్ అన్నారు.కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, జీవీ కృష్ణయ్య, చంద్రకళాబాయి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించండి



మంత్రి డోలాకు బొకే అందజేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారుల ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి. సుంకన్న కోరారు. బుధవారం ఆయన సెక్రెటేరియట్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో సరైన వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు, వార్డెన్లు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. వార్డెన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, కోశాధికారి డి. రాంబాబు ఉన్నారు.

విత్తనశుద్ధి.. సాగు వృద్ధి

- తెగుళ్ల నివారణలో ముఖ్య భూమిక
- పంటకు రక్ష
- ఆశాజనకంగా దిగుబడులు
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు



విత్తనాలను శుద్ధిచేస్తున్న మహిళా రైతులు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): పంట ఏదైనా విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవడం వల్ల నాటిన తర్వాత 25 నుంచి 30 రోజుల వరకు చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటకు రక్షణ కల్పిస్తుంది. ఇప్పుడు చాలా కంపెనీలు విత్తనశుద్ధి చేసిన తర్వాతనే రైతులకు విక్రయిస్తున్నాయి. అయినా సరే రైతులు మరోసారి విత్తనశుద్ధి చేసుకోవడం ఉత్తమమని వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచిస్తున్నారు. వివిధ పంటల్లో పాటించాల్సిన విత్తనశుద్ధి పద్ధతులు, వాటికి ఉపయోగించాల్సిన రసాయనాల గురించి ఆయన మాటల్లోనే..

వేరుశనగ : ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యుకొనజోల్ 2డీ లేదా 3 గ్రాముల మాంకోజెబ్, ట్రికోడెర్మా విరిడి పొడి మందును పట్టించాలి. కాండము కుళ్లు, వైరస్ తెగులు (పీఎస్ఎన్‌డీ), వేరుపురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 1 మి.లీ ఇమిడాక్లోప్రిడ్, 600 ఎఫ్ఎస్(గాచో) 6 మి.లీ నీళ్ల మిశ్రమంతో విత్తన శుద్ధి చేయాలి. వరిమాగానుల్లో కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు విత్తనానికి రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. మొదలు కుళ్లు, వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రికోడెర్మా విరిడి పట్టించాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టిన తరువాత శిలీంధ్రనాశనితో శుద్ధి చేయాలి. అవసరమైతే రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టించవచ్చు.

పత్తి : పత్తిలో రసంపీల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో బీటీ విత్తనం రసంపీల్చే పురుగు నివారణకు విత్తనశుద్ధి చేసిందే లభిస్తోంది. నాన్ బీటీ సాగు చేసే రైతులు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 5గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 4 గ్రాముల థయోమిథాగ్జమ్‌తో విత్తన శుద్ధి చేసి విత్తితే పంటను 40–45 రోజుల వరకు రసంపీల్చే పురుగుల నుంచి రక్షించుకోవచ్చు. అదే విధంగా తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బెండజిమ్ లేదా 2 గ్రాముల కార్బోక్సిన్ లేదా 3 గ్రాముల ట్రికో డెర్మా విరిడి లేదా సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేయాలి.

మొక్కజొన్న : మొక్కజొన్న కిలో వత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.

జొన్న : కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ రాగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.

మిరప : కిలో మిరప విత్తనానికి మొదట వైరస్ తెగుళ్ల నివారణకు 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌ను లీటరు నీటిలో కరిగించి ఆ మందు ద్రావణంలో 15–30 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టాలి. ఈ తర్వాత రసం పీల్చే పురుగుల నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, చివరగా ఇతర తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నారాయణ కాలేజ్ డీజీఎం గోవర్ధన్ రెడ్డి, తదితరులు



అత్యధిక మార్కులు సాధించిన వారితో శ్రీచైతన్య కాలేజీ డీన్స్ బాలాజీ, సరళ

కర్నూలు (సిటీ): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ జూనియర్ విభాగం ఎంపీసీలో తమ విద్యార్థులు సాయి లిఖిత 467, ఎ.నందిని 467 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు కేడీ దరహాస్ 466, డి.పవన్ కుమార్ 466 మార్కులు సాధించారని, ప్రతి ముగ్గురిలో ఒకరికి 410కిపైగా మార్కులు వచ్చాయన్నారు. అభినందన కార్యక్రమంలో కాలేజీ డీన్స్ బాలాజీ, సరళ, తదితరులు పాల్గొన్నారు.

- నారాయణ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజ్ డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. జూనియర్ విభాగం బైపీసీలో మహమ్మద్ హసీనా 437 మార్కులు, అబ్దుల్ ఉమర్ షేక్ 436, మహమ్మద్ సైఫ్ 435, మహమ్మద్ నజీర్ 435, దీపిక 435, అఖిల 435 మార్కులు సాధించారన్నారు. 437 మార్కులు ఒకరు, 436 మార్కులకుపైగా ఇద్దరు, 435కిపైగా 6 మంది, 430కిపైగా 51 మంది, 420కిపైగా 138 మంది, 400 మార్కులకుపైగా 269 మంది సాధించారన్నారు. అభినందన కార్యక్రమంలో కాలేజీ డీన్‌లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకృష్ణ, రవీంద్ర జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, కాలేజీల సమన్వయకర్త సురేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో రాజేశ్వరి 467, ఎస్.చరిత 464, పి.నేహాసుమయ 464, షేక్ రుక్సానాబీ 463, శివమనీషా 463, బైపీసీ విభాగంలో బి.ఉషారాణి 435, బి.వెన్నెల 432, అర్షియా సుల్తానా 431, కె. శిరీషా 431 సాధించారన్నారు.

స్పోర్ట్స్

విద్యార్థులకు ఆటలూ అవసరం



త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని విజ్ఞానపీఠం పాఠశాల కార్యదర్శి గురుమూర్తి అన్నారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటు అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు జరిగాయి. త్రోబాల్ పోటీల్లో విజ్ఞానపీఠం పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. బుధవారం వారిని ఆయన పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ చాటి కప్ సాధించారన్నారు.

స్కేటింగ్‌లో రాణింపు గర్వకారణం

కర్నూలు(టౌన్): స్కేటింగ్ రాష్ట్రస్థాయి జోనల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడం గర్వకారణమని మాజీ మంత్రి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను మాజీ మంత్రి అభినందించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, అంకితభావంతో ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. పతకాలు సాధించిన సాహితీ, శ్రీతిక్ చౌదరిలను అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ కుమార్, మాజీ అధ్యక్షుడు విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, స్కేటింగ్ ఉపాధ్యక్షుడు సునిత్‌కుమార్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్): జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక బాష్యం పాఠశాలలో కరాటే క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడను సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో బాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మాధవి పాల్గొన్నారు.

విజేతగా తిరిగి రండి



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్) : ధర్మవరంలో ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న 14 వ సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటి విజేతగా తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావచ్చన్నారు. ఇలాంటి అవకాశాలను హాకీ క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ మహేష్, హాకీ సంఘం నాయకులు దాసరి సుధీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరవ తరగతికి సంబంధించి ఒక్క ఖాళీ (ఓసీ) ఉందన్నారు. అర్హులైన విద్యార్థినులు ఈ నెల 28న సాయంత్రం 4 గంటలలోపు ఆధార్, పాస్‌ఫొటోలతో దరఖాస్తు పాఠశాలలో అందజేయాలన్నారు.

వెల్దుర్తి గురుకులంలో..

వెల్దుర్తిలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 28న సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన తెలిపారు. ఆరవ తరగతిలో ఎస్సీ–1, 7వ తరగతిలో ఎస్టీ–1, 8వ తరగతిలో ఎస్సీ–1, ఓసీ–1 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు పాఠశాలలో పరీక్ష ఉంటుందని, పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డీఈఓ శామ్యూల్

కర్నూలు (సిటీ): కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ సూచించారు. బుధవారం కోసిగి, కోడుమూరు కేజీబీవీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కోసిగి కేజీబీవీలో భోజనం సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్/ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కేజీబీవీల్లో నిర్దేశిత మెనూను పక్కాగా అమలు చేయాలని, వంట తయారీకి నాణ్యమైన వస్తువులను వినియోగించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే నిర్దేశిత సమయంలోపు సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఇచ్చిన వర్క్‌బుక్‌లను, నోటు బుక్కులను రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తూ ఉండాలని సూచించారు.